# మీరు భలేరావా?

## ( హాస్య నాటిక )

రచన : శంకరమంచి పార్థసారథి

పాత్రలు

1. వెంకటేశ్వర్లు
2. భలేరావు
3. శివప్రసాద్
4. చిన్నారావు
5. రామకృష్ణ
6. మరో రామకృష్ణ
7. నాంచారమ్మ.

# మీరు భలేవారే ?

## ( హాస్య నాటిక )

రచన : శంకరమంచి పార్థసారథి

**తెరతీసేసరికి**

ఓ మధ్య తరగతి ఇల్లు. అలంకరణ కాస్త భారీగానే వుంది. సోఫాలు, టెలిఫోన్, టీపాయ్, డోర్ కర్టన్స్ ; ఇల్లు రిచ్‌గా కనిపించాలనే తాపత్రయం అక్కడ అలంకరణలో కనిపిస్తుంది....

ఆ ఇంటి యజమాని పేరు వెంకటేశ్వర్లు . నలభైకి, యాభైకి మధ్యలో వుండొచ్చు తెల్లటి ఇస్త్రీ లుంగీ, తెల్లటి బనీను ధరించి నీటుగా వున్నాడు. సోఫాల్నీ, ఇతర వస్తువుల్ని శుభ్రం చేసే పనిలో వున్నాడు. అంతలో ఫోన్ రింగయింది. చేస్తున్న పనిని మధ్యలో ఆపటం ఇష్టంలేక భార్యని అలవాటు ప్రకారం పిల్చాడు.

వెంక : ఏమేవ్ !! ...ఏం చేస్తున్నావ్ ?! ఇలా వచ్చి ఆ ఫోన్ చూడు.... వినిపించిందా ! ...

ఆ కేకకి అతని భార్య నాంచారమ్మ లోపలినుంచి అక్కడికి వచ్చింది... కళ్ళకి నల్లద్దాలు, చేతిలో హేండ్‌బేగ్ ఇల్లాల్లా కాకుండా ఇంటికొచ్చిన గెస్ట్‌లా వుంది ఆమె వాలకం )....

నాంచా : హాయ్ వెంకట్ గుడ్ మార్నింగ్ ...పిల్చావా ?!

( ఆ మాటలకి వెంకటేశ్వరు వులిక్కిపడ్డాడు..... చేతిలో గుడ్డ జారి కింద పడింది కన్నార్పకుండా భార్యనే చూస్తున్నాడు నాంచారమ్మ స్టయిల్‌గా వెళ్ళి ఫోన్ తీసుకుంది )....

నాంచా : హాయ్ పార్వతీ ....ఇప్పుడే రడీ అయ్యా!! బయలుదేరుతున్నా సెమినార్ తొమ్మిది గంటలకి కదా ఓకే వచ్చేస్తున్నా !! అన్నట్టు టీవీ వాళ్ళకి , ప్రెస్సువాళ్ళకీ ఇంకోసారి ఫోన్ చెయ్యమని కామాక్షిగారికి చెప్తే మంచిది.... టీవీలో చూపించకపోతే మన ఉద్యమం గురించి అందరికీ ఎలా తెలుస్తుంది?! సరే.... అలాగే ...ఓకే... వెంకటేశ్వర్లు ...ఇక్కడే వున్నాడు... సోఫాలు దులుపుకుంటున్నాడు...ఇంకా తెలీదు...వుంటా ?...!! ( ఫోన్ పెట్టి , వెనక్కి తిరిగి వెంకటేశ్వర్లు వాలకం చూసి )

నాంచా : మిమ్మల్నే ...ఏమిటలా అయిపోయారు ? !

వెంక : ఏమిటే అన్నావ్ ?! హాయ్ వెంకట్టా !! మతిగాని పోయిందా ? నేను నీ మొగుడ్ని !!

నాంచా : కావచ్చు కానీ.... ఈరోజు మాత్రం కాదు... ఇవాళ మనం మంచి స్నేహితులం !! భార్యాభర్తలం కాదు.

వెంక : మంచి స్నేహితులమా ? ! అంటే మిగిలిన రోజుల్లో శత్రువులమా ?!

నాంచా : భార్యాభర్తలం గదా ...అంతేమరి !!

వెంక : ఆ కళ్ళజోడు .....ఆ హేండ్‌బేగ్ .....ఆ వాలకం పైగా సెమినార్ ....ఉద్యమాలు అంటున్నావ్ కామాక్షిగారు కొత్త కార్యక్రమం ఏదైనా మొదలుపెట్టిందా ?!

నాంచా : అవును వెంకట్ !! ఇవాళ జాతీయ భార్యల దినం !!

వెంక : భార్యల దినమా ?!

నాంచా : టీచర్స్‌డే ...పేరెంట్స్ డే ...లవర్స్ డే ...లాగా ప్రతి సంవత్సరం ఈ రోజున వైఫ్స్‌డేగా జరుపుకోవాలని మా భార్యల సమాజం నిర్ణయించింది.

వెంక : ఇవాళ కామాక్షిగార్ని మొగుడు వదిలేసిన రోజేమో అని నా అనుమానం.

నాంచా : కాదు వెంకట్ !! మొగుడ్ని కామాక్షమ్మగారు విసర్జించిన రోజు ... స్త్రీ జాతికి ముఖ్యంగా భార్యలకి విమోచన దినంగా జరుపుకోవాలని ఏకగ్రీవంగా నిర్ణయించాం !!....

నాంచా : నాకు బీపీ పెరుగుతుంది...నువ్వు లోపలికి వెళ్ళు !! మనం తర్వాత మాట్లాడుకుందాం !!

నాంచా : సారీ వెంకటేశ్వర్లు ! ఈ రోజు ఆర్డర్సు జారీ చెయ్యటాలు, అమలు పరచటాలు , విసుక్కోవటాలు , అమలు పరచటాలు , ఇలాంటి రొటీన్ కార్యక్రమాలు వుండవు మనం మంచి స్నేహితులం కాబట్టి.... గౌరవ

మర్యాదలు ఇచ్చిపుచ్చుకోవాలి !! ఏయ్ ... ఓయ్... ఏమేవ్..... ఒసేవ్ ....ఈ పదాల్ని ఇవాళ వాడకూడదు...అర్థమైందా !?

వెంక : ( వ్యంగ్యంగా ).... ఇంకాస్త విపులంగా చెప్తారా ...సారీ కాస్త డౌటుగా వుంది !!

నాంచా : ఇట్సాల్‌రైట్ వెంకట్ !! నీ సంగతి నాకు తెలీదు !! నీకు అర్థమయ్యేటట్టుగా ఒక్క ముక్కలో చెప్తా విను !! నన్ను ఎవరన్నా ఈరోజు ఎరువుల కంపెనీ పిఆర్ఓ నీకేమవుతారంటూ అని అడిగారనుకో .....?! ఆయన నాకు మంచి మిత్రుడు ...ఫ్యామిలీ ఫ్రెండు అని చెప్తా గానీ.... మా వారేనండీ అని చెప్పను !! భర్తలో ఫ్రెండుని చూసుకోవటమే వైఫ్సడే లక్ష్యం అర్థమైందా ?! అదేమిటి తలుపు మూస్తున్నారు. నే సెమినార్‌కి వెళ్ళాలి.

వెంక : వెదుదువుగాని...ఒక్క పదినిమిషాలు – అంతే ఎప్పటి నించో మంచి ఫ్రెండ్‌ని చావగొట్టి చెవులు ముయ్యాలని అనుకుంటున్నా !! ఈ రోజుకి ఆ అవకాశం వచ్చింది !! ( సరైన ఆయుధం గురించి నలువైపులా చూసి అందుబాటులో వున్న ఫ్లవర్‌వాజ్‌ని తీసుకుని ఆమె వెంట పడ్డాడు.... ఆమె కంగారుగా అటు ఇటు పరిగెడుతుంది ఇద్దరూ సోఫాల చుట్టూ రౌండ్లు కొడుతున్నారు )

నాంచా : ఇది అన్యాయం. అక్రమం, మొగుళ్ళ దౌర్జన్యం నశించాలి. ఒక్కరోజైనా భార్యని ఫ్రెండుగా చూడలేరా. భార్యని స్నేహితురాలిగా గౌరవించలేరా.

వెంక : భార్యల్లో ఫ్రెండుని, ఫ్రెండ్సులో భార్యని చూసే టైపు మొగుణ్ణి కాను, పిచ్చి వేషాలు వేశావో నరికి పోగులు పెడతాను. ( అంతలో ఫోన్ రింగయ్యింది. ఇద్దరూ నిలబడి ఫోన్ వంక చూస్తున్నారు. )

వెంక : ఫోన్ చూడు. నా గురించి ఆఫీసు వాళ్ళెవరన్నా అడిగితే ఇంట్లో లేనని చెప్పు. ఎప్పుడు వస్తారో తెలీదని చెప్పు. కొత్త ఎండిగారొచ్చే సరికి అంతా హడలి ఛస్తున్నారు. నిన్నే, చెప్పింది వినిపించిందా.

నాంచా : ఇది ఆర్డరా ! రిక్వెస్టా ? నిజాయితీగా చెప్పు వెంకట్.

వెంక : క్షణం ఆలోచించి సర్లేవే రిక్వెస్టే సరేనా ఫోన్ తియ్యి.

నాంచా : మీరలా వెళ్ళి దూరంగా నిల్చోండి. కదలకూడదు ( వెంకటేశ్వర్లు అలాగే వెళ్ళి ఆమెకి ఎదురుగా, దూరంగా నిల్చున్నాడు. నాంచారి ఫోన్ ఎత్తి మాట్లాడుతోంది )

నాంచా : హల్లో ఎవరండీ రామకృష్ణ గారా.... ఆ ! అవును. ఆయన మా బావగారండీ. వస్తానని చెప్పారా. .... ఇంకా రాలేదండి. ( వెంకటేశ్వర్లు భార్య వంక వెర్రిచూపులు చూస్తూ ఆమెని సమీపించడంతో తలుపు రాను చప్పుడైంది. వెళ్ళి వీధి తలుపు తీశాడు)

నాంచా : మీరెవరండీ ....? మీ పేరు ...మా బావకి బాగా తెలిసినవాళ్ళా.

( రామకృష్ణ పెట్టె పుచ్చుకుని కంగారుగా లోనికి వచ్చాడు. అతన్ని చూడగానే నాంచారమ్మ అంది ) మా బావగారు ఇప్పుడే వచ్చారండీ. లైన్లో ఉండండి. బావా నీ గురించే ఫోన్. నువ్వు వాళ్ళకి బాగా కావలసిన వాడివట.

( రామకృష్ణ కంగారుగా ఫోన్ అందుకుని )

రామ : హల్లో హల్లో రాస్కెల్ ఫోన్ పెట్టేశారు. ఎవరట పేరు చెప్పారా ? ఏం అడిగారు. నువ్వేం చెప్పావ్.

వెంక : ఎందుకండీ అంత కంగారు. ఎవరో మీ ఫ్రెండయి ఉంటాడు.

నాంచా : ఏం బావా ఇదేనా రావటం. అక్కా పిల్లలు ఎలా ఉన్నారు.

రామ : ( పరధ్యానంలో ...) అక్క పిల్లలా....?

వెంక : ఏ అక్కా పిల్లలో సరిగ్గా అడుగు ! అసలే కంగారుగా ఉన్నాడు. రామకృష్ణా నీ పని బాగుందయ్యా. చక్కగా జీవితాన్ని ఎంజాయ్ చేసి పారేస్తున్నావ్.

రామ : ఆగవయ్యాబాబూ .....ఆ ఫోన్‌లో మాట్లాడిన వాడు పేరు చెప్పలేదా ...ఏం అడిగాడు.

నాంచా : రామకృష్ణగారు మీ ఊరు రావాలి.... రాలేదా అని అడిగారు. ఇంతలో రానే వచ్చావ్.

రామ : వాళ్ళే ....వాళ్ళే అయ్యుంటారు. రాస్కెల్స్.

నాంచా : ఎవరు బావా ? దేనికి కంగారు ...ఏమైంది.

రామ : అబ్బే ఏం లేదు. ఏదో ఆఫీసు గొడవలు. ఊ ఎలా వున్నారు. వెంకటేశ్వర్లు బాగా చూసుకుంటున్నాడా, మీ అక్క నిన్ను మరీ మరీ అడిగానని చెప్పింది. మర్చిపోకుండా ఉత్తరం రాయమంది.

నాంచా : అమ్మో... నే వెళ్ళాలి. మీటింగ్‌కి టైమైంది. బావకి కాఫీ ఇచ్చి వెళతా.

( నాంచారి లోనికి పరిగెత్తింది )

రామ : మీటింగా ... ఏం మీటింగ్ సామూహిక విష్ణు సహస్రపారాయణానికా....

వెంక : కాదు.... ఇవాళ ఆలిండియా హవుస్‌వైఫ్స్ డే అట. సెమినార్లు...చర్చలూ .... తీర్మానాలూ ...గబుక్కున మీ మరదలు నన్ను ఏరా వెంకటేశ్వర్లు అంటే కంగారుపడి స్పృహ తప్పకండి....

రామ : అంటే ఉద్యమం వూపందుకుందన్నమాట. సరే నాంచారమ్మ రాకముందే నీకో సంగతి చెప్పాలి చిన్న ఇబ్బందిలో పడ్డానయ్యా.... సరోజినీ లేదు.

వెంక : సరిజినీ అంటే కాకినాడ పార్టీయా ??

రామ : కాకినాడ  పార్టీ సరోజిని కాదు శ్రీలక్ష్మి బంగారం లాంటి మనిషి... నోరు తెరిచి ఇది కావాలి అని అడగదు.

వెంక : ఏం పాపం... మూగదా ??

రామ : మనం జోకులు  తీరుబడిగా  వేసుకుందాం !!  ముందు  ఇది విను  !! వైజాగ్‌లో సరోజిని  అని పరిచయస్తురాలు ...నీకు తెల్సుగా !!

వెంక : తెల్సు తెల్సు !! మీరు గోపాలకృష్ణులు గదా !!  వైజాగ్ సెటప్  !! ఇంతకీ  ఏమైందీ ?! పెళ్ళిచేసుకోమంటుందా ?

రామ : అలా అన్నా బాగుండేది  !! ఏ గుళ్ళోనో  మూడో కంటికి  తెలియకుండా  మూడు ముళ్ళు వేసేస్తే  మూలనపడి వుండేది !! దానికి  ఈ మధ్యన  డబ్బు పిచ్చి పట్టింది !!

వెంక :  ఎంతట !?

రామ : లక్షట !! లక్ష రూపాయలు  పెట్టి స్థలం  కొనిపెట్టేయ్  అంటూ  ఒకటే గోల  !! ఒకరోజు  ఒళ్ళుమండి  ఛీ.... అవతలకి  పో అన్నానంతే !!

( సరిగ్గా  అప్పుడే నాంచారి  కాఫీ  కప్పుతో వచ్చింది )

నాంచా :  కాఫీ  తీసుకోబావా !! స్నానానికి  నీళ్ళు  పెట్టమంటావా ?!

వెంక : ఏం వద్దు  మేం మాట్లాడుకోవాలి  !! నువ్వు  లోపలికి పో !

నాంచా :  ఏం నే వినకూడని  రహస్యాలా  ? !! మా బావ మీలాగా  కాదు !!  చక్కగా అన్నీ చెప్తాడు.  చెప్పు బావా  ఇంకేంటి  విషయాలు ( అంటూ  కూర్చుంటుంది )

వెంక  :  అదే మరి, క్లయిమాక్స్‌లో  కరెంటు  పోవడమంటే !!

నాంచా : ఏంటి వెంకట్ దేనికి చిరాకు  బావా  వెంకట్ అంటున్నానని ఆశ్చర్యపోకు ఇవాళ..

రామ  : మేటరు  చెప్పాడమ్మా  !! బాగా  ఎదిగిపోయావ్ !! ఇక  నువు మంచి రోజులు చూసి  ఆఫీసుల  ముందు ధర్నాలు, నిరాహార  దీక్షలు  మొదలు పెట్టేయొచ్చు.

నాంచా :  బావా  నేనలా బయటికి  వెళ్ళి గంటలో  వస్తాగానీ  ఈలోపు  నీ స్నానం కానియ్యి !!  ఏవండీ  ఇవాళ వంటగదికి  సెలవు.... హొటల్ నుంచి  కారియర్ తెప్పించుకోండి !! సరేనా !!

రామ  :  వంట గురించి నువ్వేం వర్రీ కాకు !! నేలేనూ !! నువ్వెళ్ళిరా !!  ( నాంచారి వెళ్ళబోగా  శివప్రసాద్ ఆమెకి ఎదురొచ్చాడు. ఆమెని,  మిగిలిని ఇద్దర్ని  పరీక్షగా చూసి చివరకు  అతని చూపులు రామాకృష్ణ  పైన ఫిక్స్  అయినాయి. రామకృష్ణ కాస్త కంగారుపడి )  ఎవరు కావాలండీ....  మీరెవరూ ?!

మీరెవరూ ?! చెప్తా చెప్తా ... మిమ్మల్ని ఎక్కడో చూశా.... మనం ఇది వరకు ఎక్కడన్నా కలిసామా ?!

రామ : లేదు ...లేదు ...మనం అస్సలు కలవలా !!

శివ : లేదు. లేదు మీ ఫేసు బాగా గుర్తు . ఎక్కడో కల్సాం !! కానీ గుర్తులేదు !!

నాంచా : లోపలికి రండి.... అలా కూర్చోండి !!

రామ : దేనికి కూర్చోవటం !? ఆయనేం మన బంధువా ?! స్నేహితుడా ? నీ ఛాదస్తం నువ్వూనూ ....

శివ : మీ పేరు గూడా నోట్లో ఆడుతోంది !! మీ పేరు ?!

రామ : వెంకటేశ్వర్లు !! ( నాంచారి / వెంకటేశ్వర్లు ఆ మాటలు విని వులిక్కి పడ్డారు )

శివ : వెంకటేశ్వర్లా ? ! అంటే మీరు ఎరువుల కంపెనీలో పి ఆర్ ఓగా....

రామ : యస్ ...పేరు వెంకటేశ్వర్లు !! ఎరువులు కంపెనీలో పి ఆర్ ఓ అది నా వైఫ్ !!

వెంక : మరి నేనెవర్ని ? ! నా భార్య ఎవరు....వెరీజ్ మై వైఫ్ ?!

రామ : నా కజిన్ బ్రదర్‌వి. పేరు రామతిలకం !! నీకింకా పెళ్ళాకాలా. లక్కీ ఫెలోవి... నీకు భార్యలేదు !!

శివ : ఆయన వివరాలు ఆయన చెప్తున్నారు ?

రామ : ఈ మధ్యన మానసికింగా దెబ్బతిని ట్రీట్‌మెంట్‌కి ఈ ఊరు వచ్చాడు !! బైదిబై ఇంతకీ మీరెవరూ ?! ఏం పని మీద వచ్చారో చెప్పనేలేవు ?!

నాంచా : అదికాదు బావా ...ఆయనేమిటి...

రామ : నువ్వు మీటింగ్‌కి వెళ్ళాలన్నావ్ వెళ్ళరా !! ఇవాళ వైఫ్స్ డే కదా !! అంచేత ఎటువంటి అనుమానాలు పెట్టుకోక వెళ్ళిరా !! ఏరా నువ్వెళ్ళి రెస్టు తీసుకో !! నే డాక్టరుతో మాట్లాడి ఎన్నింటికి రమ్మంటాడో కనుక్కుంటా !?

శివ : ఓ.కే వెంకటేశ్వర్లుగారు ! మీ కంపెనీలో కొత్త ఎం.డిగా వచ్చిన భలేరావ్ గారు తెల్సా !!

రామ : భలేరావా ! వాడెవడు ?! నాకు తెలీదు ?!

వెంక : నాకు తెల్సు !! ఎరువుల కంపెనీకి కొత్తగా పోస్టయిన ఎం.డి?ఛార్జ్ తీసుకొని వారం అవుతుంది !!

శివ : అరెరె .... కరెక్టుగా గడగడా చెప్తున్నారు !! మీకెలా తెల్సు ?!

వెంక : ( రహస్యంగా రామకృష్ణతో ) ఇతనెవరో మా కంపెనీ తాలుకా వాడిలా వుంది... మీకేం భయం లేదు నిజం చెప్పండి !!

రామ :  అదే తప్పు ...తొందరపాటు .... నువ్వేం  మాట్లాడక ! నాంచారీ  బాబుని లోపలికి తీసుకువెళ్ళు !!

వెంక :  వూ... నే వెళ్ళను...ఇక్కడే వుంటా...

శివ : నేను భలేరావ్ గారి  బావమరిదిని !!

రామ : భలేరావ్ గాడా ! వాడెవడు ?!

శివ : వాడా.... ఆయన మీ కంపెనీ ఎం.డి

రామ : అయితే ...ఆయన ఎం.డి  అయితే  నేను  పి.ఆర్.ఓని

వెంక :  పి.ఆర్.ఓ ఎం.డి.కంటే తక్కువ ...కాస్త  తెలుసుకుని మాట్లాడండి !!

శివ :  ఆ కంపెనీ ఉద్యోగివయ్యుండి ఎం.డి.గురించి అగౌరవంగా  మాట్లాడటం మంచిది కాదు....ఆయనసలే తిక్కమనిషి !!

వెంక :  సార్ మీ పేరేంటీ ... ?!  వెంకటేశ్వర్లు వారు కాదు నేను !!  నిజంగా నేనే ! కాబట్టి ఒట్టు ! నా మాట నమ్మండి !!

శివ :  అలాగే  వెళ్ళి రెస్టు తీసుకో !! చూడండి మా  బావ  భలేరావ్ గురించి అగౌరవంగా మాట్లాడేరు....ఓ.కే మీ దగ్గరకి  ముఖ్యమైన  పనిమీద  పంపించారు. ఇంక అనవసరం  వస్తా....బై !! ( వెళ్ళిపోయాడు )

వెంక :  సార్....  హల్లో ....ఆగండి !! మిమ్మల్నే !!  ఎం.డి గారి బావమరిదినని చెప్తున్నా మీ  ఇష్టం  వచ్చినట్టు  వాగేసారు.... రేపు  ఆ తిక్క  ఎం.డి ...నన్ను  ఉద్యోగం లోంచి  తీసిపారేస్తే....

నాంచా : అది కాదు బావా !! అసలేమిటిదంతా ?! నువ్వు  వెంకటేశ్వర్లు  ఏమిటి....నేను నీ భార్యనేమిటి ఆయనేమో ....( అంతలో కామాక్షి తమ్ముడు  2 వ రామకృష్ణ ఆదుర్దాగా  లోనికి వచ్చి )....

2 రామ : మీ ఇంటి  గురించి తిరిగి తిరిగి ప్రాణం  పోయింది.  అక్క మిమ్మల్ని  వెంట బెట్టుకుని  తీసుకురమ్మని పంపించింది. ... నమస్కారం  సార్ !!

నాంచా : కామాక్షమ్మగారి తమ్ముడు. నీ పేరేంటి బాబు ?!

2రామ : రామకృష్ణండి !! వెంకట శివరామకృష్ణ  !! కానీ  బాగా  పొడుగైందని రామకృష్ణగా తగ్గించా !!

వెంక :  అచ్చు మీ పేరే .... రామకృష్ణట !!

1 రామ : ఏం చేస్తుంటారు ?!

2 రామ : సన్మాన పత్రాలు, సంతాప సందేశాలు,  వందన  సమర్పణలు రాస్తుంటానండి !!

అప్పుడప్పుడూ పొయిట్రీ గూడా రాస్తుంటానండి !! ఇప్పుడే వైఫ్ డే మీద చిన్న కవిత రాసా ...చూడండి ( అని చేతిలో డైరీని రామకృష్ణకి అందించాడు )

నాంచా : చాలా బుద్ధిమంతుడు !! కామాక్షమ్మగారికి హేండ్‌బ్యాగ్ లాంటివాడు. !!

2రామ: మొత్తం వచ్చారు !! మీరు ఇలా రావటం అలా మీటింగ్ మొదలవటం అంతే !!

నాంచా : అలాగా పద ...పదా ! బావా నే గంటలో వచ్చేస్తా !! ఏవండీ ఇల్లు జాగర్త !! పద.... ( 2 రామకృష్ణ చెయ్యి పుచ్చుకుని బయటికి వెళ్ళిపోయింది )

1 రామ : అరె కుర్రాడు డైరీ మర్చిపోయి వెళ్ళాడు. ఏమిటయ్యా ఏదో వర్రీగా వున్నట్టున్నావే.

వెంక : మా ఎం.డి గారి బావమరిదితో ఇష్టం వచ్చినట్టు మాట్లాడేరు... ఏం జరుగుతుందో అని భయంగా వుంది !!

1 రామ : వెంకటేశ్వర్లు నువ్వొత్త వెంకటేశ్వర్లువే !! కాకపోతే ఇంత చిన్న విషయానికి అంత పెద్దగా వర్రీ అవటమా !! నాన్సెన్స్ ఏం కాదు !! నువ్వు ధైర్యంగా వుండు !! ఇదిగో నా గురించి ఎవరొచ్చినా నీకేం తెలీదు ఓకే !!

వెంక : అబ్బ సర్లేవయ్యా !! ఒకసారి చెప్పావ్ కదా గుర్తుంది !!

రామ : సరే నే వెళ్ళి స్నానం చేసొస్తా !! ఈ లోపు ఎవరన్నా కుర్రాడుంటే మంచి టిఫిన్ తెప్పించు ( రామకృష్ణ లోనికి వెళ్ళాడు, వెంకటేశ్వర్లు ఆలోచిస్తూ పచార్లు చేస్తున్నాడు !! అంతలో చిట్‌ఫండ్ కంపెనీ చిన్నారావ్ వొచ్చాడు !)

చిన్న : ఎక్స్‌క్యూజ్‌మీ !! కె.వెంకటేశ్వర్లు, పి.ఆర్.ఓ నేషనల్ ఫర్టిలైజర్ కార్పొరేషన్...

వెంక : నేనే ఆ వెంకటేశ్వర్లుని.... మీరెవరో...ఏం కావాలి!?

చిన్నా : నా పేరు చిన్నారావండీ !! అక్షయ్ చిట్‌ఫండ్ కంపెనీ తాలూకు.....

వెంక : అలాగా ...ప్లీజ్ కమ్ !! అలా కుర్చోండి !!

చిన్నా : మీరు లక్షరూపాయిల చీటీ పాడుకున్నా కానీ గ్యారంటీ సంతకాలు ఇద్దరిచేత చేయించారు కంపెనీ రూల్స్ ప్రకారం ముగ్గురు గ్యారంటీ ఇవ్వాలి !!

వెంక : అదా సంగతి అంటే ఇంకో ష్యూరిటీ సంతకం కావాలి అంతేగా. అయినా ఫెర్టిలైజర్సు కంపెనీలో పి.ఆర్.ఓ.ని బాధ్యతగల ఆఫీసర్ని నా విషయంలో గూడా డౌటేనా ?! ( రామకృష్ణలోపలి నుంచి ఒక న్యూస్ పేపర్ తీసుకువచ్చి వెంకటేశ్వర్లుకి చూపిస్తూ )

రామ : ఇదిగో పేపర్లో ఆ ఫోటో చూడు ఉదయం మీ ఎం.డి బావమరిది అంటూ వచ్చిన వాడిదేగా .... ( వెంకటేశ్వర్లు ఫోటో చూస్తున్నాడు...రామకృష్ణ చిన్నారావ్‌ని అనుమానంగా చూస్తున్నాడు )

వెంక : కాదు.... అలా వున్నాడేగాని ...అతను కాదు....

చిన్నా : అలా వున్నాడు !! అతను కాదు ఏమిటి సార్ !! ఎలా వున్నాడు !? ఎవరు కాదు ( పేపరు తీసుకుని చదివాడు) పెద్ద అధికార్ల పేర్లు చెప్పి ప్రజల్ని మోసగిస్తున్న ఘరానా ముఠా అరెస్టు !!

రామ : మీరెవరూ ?!

చిన్నా : వెంకటేవ్వర్లు గారి గురించి వచ్చానండి !!

వెంక : అక్షయ చిట్‌ఫండ్ కంపెనీ ఏజెంటు పేరు చిన్నారావ్ !!

రామ : కంపెనీ వాళ్ళు ఇచ్చిన గుర్తింపు కార్డు చూపించాడా ?! నాకు ఆ సరోజిని తాలూకు వాడేమోనని డౌటు...

వెంక : అతను చిట్‌ఫండ్ కంపెనీ వాడూ !! అనవసరంగా టెన్షన్ పడకండీ... బైదిబై చిన్న ఆబ్లిగేషన్ !! కంపెనీ రూల్స్ ప్రకారం ముగ్గురు గేరంటీ ఇవ్వాలంట !! నేనేమో ఇద్దరిచేత చేయించా !! మూడో సంతకం గురించి వచ్చాడు !!

చిన్నా : సార్ చేత చేయించండి సార్ !! ఏం పేరు ?! ఏం చేస్తుంటారు.

రామ : ( కంగారుగా ) సరే.... మనం తర్వాత ఆలోచిద్దాం !! అతన్ని పంపించేయ్ !!

చిన్న : మా ఎం.డి గారు ఢిల్లీ వెళుతున్నారు !! పదిరోజుల దాకా రారు !! ఇప్పుడు సంతకం చేయించి ఇచ్చారంటే రేపటికల్లా చెక్ రెడీ చేయించి పెడతా !!

వెంక : నా మీద నమ్మకం లేకపోతే వద్దు !! వాళ్ళకి మూడు సంతకాలు కనపడాలి అంతే.... వైజాగ్ రామకృష్ణ అయినా, కాకినాడ కృష్ణమూర్తి అయినా ఒక్కడే !!

చిన్నా : మీరు వైజాగ్‌లో వుంటారాసార్ ? పేరు రామకృష్ణా ?

రామ : వెంకటేశ్వర్లూ ...అతన్ని తర్వాత రమ్మను !! నాక్కాస్త టైమియ్యి !! మెంటల్గా ప్రిపేరవ్వాలా !!

వెంక : మెంటల్గా ప్రిపేరవ్వాలా ? దేనికీ సంతకం చెయ్యటానికా ... చెయ్యనని చెప్పటానికా ?

చిన్న : సంతకాలు పెట్టేవాళ్ళలో మూడు రకాలవాళ్ళు వున్నారు సార్ !! అడగంగానే ఠపీమనీ పెట్టే వాళ్ళు ! కాస్త టైం తీసుకుని మొహమాటానికి పెట్టేవాళ్ళు, ససేమిరా కుదరదని నిర్మొహమాటంగా చెప్పేవాళ్ళు... ఇంతెందుకు సార్ సరోజిని గారనీ....

రామ : సరోజినా ? వెంకటేశ్వర్లూ చెప్పానా లేదా ? వెళ్ళమను, తర్వాత రమ్మను !! ( చిన్నారావ్‌ని కుర్చోమని సంజ్ఞ చేశాడు. అంతలో శివప్రసాద్ పంచె కట్టుకుని,

చిన్న మీసం పెట్టుకుని లోనికి వచ్చాడు. మొహాన్ని రామకృష్ణకి కనిపించకుండా మరోవైపుకి తలతిప్పి పాట పాడుతున్నాడు )

శివ : సరోజదళనేత్రి హిమగిరిపుత్రీ నా పాదాంబు జముల్ సదా కొల్చి నానమ్మవరమిమ్మా ! ( రామకృష్ణ వులిక్కిపడ్డాడు )

రామ : ఎవరు ?! ఎవరో ఏమిటో అడగవేం ?

వెంక : సారీ ! నేను మూడో సంతకం మూడ్లో వున్నా !! ఎవరు బాబూ !!

శివ : ఎవరినో తెలీకే ఇలా ఇళ్ళు పట్టి తిరుగుతున్నా !! రామకృష్ణా మఠానికి వెళ్ళాలి !! అడ్రస్సు చెప్తారా !!

రామ : రామకృష్ణా .... మఠం....

చిన్నా : రామకృష్ణా మఠం ...ఇందిరా పార్కు తెల్సా !!

శివ : ఇందిరాపార్కు ! అంటే సరోజినీదేవి కళ్ళ ఆసుపత్రి.

రామ : ( కంగారుగా ) వెంకటేశ్వర్లూ ఇహ ఏం అనుమానం లేదు ! ఆ రాక్షసి తాలూకే... తెలీదని బయటికి నెట్టేయ్ !! మీరు నాతో రండి. చిటఫండ్ కంపెనీ రూల్సు డిస్కస్ చేద్దాం !! ( చిన్నారావ్ ని రామకృష్ణ లోనికి లాక్కుపోయాడు. శివప్రసాద్ అప్పుడు తన మొహాన్ని వెంకటేశ్వర్లుకి చూపించాడు !!

శివ : హమ్మయ్య వెళ్ళాడు గదా !

వెంక : ఏయ్ నువ్.... నువ్వు భలేరావ్ గారి బావమరిదినంటూ వచ్చినవాడివేగా

శివ : ఓర్ని పేషెంటువయినా భలే గుర్తుపట్టావే ..... గట్టిగా అరవకు !! మారువేషంలో వచ్చా !! ( వెంకటేశ్వర్లు అక్కడున్న పేపర్లో వున్న ఫోటోని, నిల్చున్న వ్యక్తిని పోల్చుకుని చూస్తున్నాడు ) చూసింది చాలుగాని... వెళ్ళి రెస్టు తీసుకో ....ఆ వెంకటేశ్వర్లు....

వెంక : ఏ వెంకటేశ్వర్లు !!

శివ : పిచ్చిమాలోకం చెప్పినా ఏం పర్లేదు !! ఆ గదిలో వున్నఫెర్టిలైజర్ కంపెనీ పి.ఆర్.ఓ వెంకటేశ్వర్లు ఇందాక పిచ్చి పిచ్చిగా డోంట్ కేర్ మాస్టర్లాగా వాగేడుగా ...ఆ ఎం.డి భలేరావ్ని తీసుకొచ్చా !! ఆ వెంకటేశ్వర్లు పని గోవిందా ...గోవిందా !!

వెంక : అయ్యబాబోయ్ ఎం.డి గారొచ్చారా ? ఎక్కడ !! వెంకటేశ్వర్లు నేనే ఒట్టు....

శివ : అక్కర్లా ! ప్రార్ధనలు మొదలు పెడితే ఆ పాత్ర ప్రవేశిస్తుంది... పరబ్రహ్మ పరమేశ్వర .... ( ప్రార్ధన మొదలుపెట్టగానే భలేరావ్ ముష్టివాడి వేషంలో చిప్ప, కర్ర పుచ్చుకొని లోనికి వచ్చేసి ప్రక్కనే ...నిలబడే ప్రార్ధనా గీతం ఆలపిస్తున్నాడు )

భలే రావ్ : ( ప్రార్థన అవగానే ) ప్లే మొదలెడదామా ?! ( అని జేబులోంచి కళ్ళజోడు తీసి, కాగితం తీసి చదువుతున్నాడు ) అమ్మా !! అన్నం తిని మూడురోజులైందమ్మా !! అన్నపూర్ణమ్మ తల్లీ !! మిగిలిపోయిన అన్నం వున్నా !! కూరవున్నా !! పులుసువున్నా !! పచ్చడున్నా. ఎంతున్నా , ఏదున్నా వడ్డించు తల్లీ ( కళ్ళజోడు / కాగితం తిరిగి జేబులో పెట్టుకున్నాడు )

శివ : ఇప్పుడు నటించక్కర్లా !! అసలు వెంకటేశ్వర్లు లోపలున్నాడు.

భలే : ఈయనెవరు

వెంక : నేనేసార్ ! మన కంపెనీ పి.ఆర్.ఓ ని వెంకటేశ్వర్లుని !!

శివ : అని అనుకుని అంటూ వుంటాడు !! కానీ కాదు! మనం అవునంటే ఆనందపడతాడు

భలే : అదా మేటరు !! పాపం పూర్ ఫెలో !! అయితే అలాగే అందాం !!

వెంక : సార్ నిలబడే వున్నారు !! అలా కూర్చోండి సార్ ( అంతలో చిన్నారావ్ లోపలి నుంచి అక్కడికొచ్చాడు )

చిన్నా : అదేం మనిషండీ బాబూ !! నువ్వెవరో చెప్పు ...నువ్వెవరో చెప్పు అని ప్రాణాలు తోడేసాడు.

శివ : లోపలున్నవాడేగా !! బయటికి రాగానే పొగరు కాస్త దిగిపోయి కాళ్ళపైన పడాలి.

వెంక : సార్ నిలబడే వున్నారు కాస్త కుర్చోండి సార్??. మొదటిసారిగా మా ఇంటికొచ్చారు.... సమయానికి నా వైఫ్ గూడా ఇంట్లో లేదు...

భలే : మన సంస్కృతిని, సాంప్రదాయాన్ని మర్చిపోని పిచ్చివాడు " ఐ లైక్‌దిస్ మాడ్‌మేన్ "

శివ : మీరు ముష్టివాళ్ళు !! ఇంగ్లీష్ మాట్లాడకూడదు !! సహజత్వం కోసం మేం కింద కూర్చుంటాం !!

వెంక : నో..నో..ప్లీజ్ సార్ !! ( భలేరావ్ చిప్ప ఒళ్ళో పెట్టుకుని సోఫాలో కూర్చున్నాడు శివప్రసాద్, కింద ఆయన కాళ్ళ దగ్గర కూర్చున్నాడు )

చిన్న : ఎవర్సార్ వీళ్ళు ! అంతా బతిమాలుతున్నారు !! మూడో సంతకం గురించా ! ముష్టివాళ్ళు సంతకాలు కంపెనీ ఒప్పుకోద్సార్ !! ( అంతలో రామకృష్ణ రెండు కప్పులతో కాఫీ తెచ్చాడు చిన్నారావ్‌ని చూసి )

రామ : ఇంకా నువ్విక్కడే వున్నావా ! ఎవరు వీళ్ళు ముష్టివాళ్ళ లాగున్నారు !! దర్జాగా సోఫాలో కూర్చున్నారు !!

వెంక : నేనే బతిమాలి కూర్చోపెట్టా ! మీకేవన్నా అబ్జక్షనా!

రామ : నాకేం అబ్జక్షనేం లేదుగానీ !! మారువేషాల్లో వున్నారేమో అని అనుమానంగా వుంది ?

వెంక : మీకు అనుమానం ఏవీ అక్కర్లేదు !! వీళ్ళు నిజంగా మారు వేషాల్లోనే వున్నారు ఆయన మా ఎం.డి భలేరావ్‌గారు.

రామ : అని ఆయన చెప్పుకున్నాడా!!

వెంక : లేదు కింద కూర్చున్న ఆయన పైన కూర్చున్న ఆయన గురించి చెప్పాడు...

చిన్నా : మా ఎం.డి గారయితే ముష్టివాడి వేషంలో దేనికిసార్ రావడం !

రామ : అదేగా నా డౌటు ఆ కింద కూర్చున్న వాడేగా ఉదయం వచ్చింది !!

భలే : " మిస్టర్ వెంకటేశ్వర్లూ !! కమ్ హియర్ " సారీ ...ఇలారా !! ( వెంకటేశ్వర్లు నమ్రతగా వెళ్ళిచేతులు కట్టుకుని )

వెంక : చెప్పండి సార్

భలే : నువ్వు కాదు . నే పిల్చింది ఆ వెంకటేశ్వర్లుని !! ఇలారా నిన్నే

చిన్న : ఆ వెంకటేశ్వర్లా !! అదేంటీ ?!

వెంక : జరిగింది మొత్తం చెప్పేయటం మంచిది !! నన్నొదలండీ !!

రామ : ఉష్ !! ఆవేశపడకు బాగా ఆలోచించు ఆ వచ్చింది మీ ఎం.డి నే అయితే ఖచ్చితంగా తెలిసేదాకా తొందరపడకుండా వుండటం మంచిది !! నువ్వు కాచుకోవాల్సింది వీళ్ళిద్దరూ కాదు!! ఈ చిట్‌ఫండ్ వాడ్ని మూడో సంతకం నే చేసినా అనుమానం వస్తే చెక్కు ఆపెయ్యగల్డు...

చిన్న : అది కాద్సార్ !! ఆ వెంకటేశ్వర్లు అంటూ వార్ని పిలుస్తారేవిటీ ! వెంకటేశ్వర్లు మీరు కదా !!! ( రామకృష్ణ , చిన్నారావ్‌ని లాగిపెట్టి కొట్టి )

రామ : ఎంతమాటన్నావ్ !! నీకెన్ని గుండెలు !! నా ముందు నిర్భయంగా అంత మాట అంటావా ?

చిన్న : ఇప్పుడు నేనేం అన్నా సార్ !

శివ : మిస్టర్ వెంకటేశ్వర్లు !! సార్ పిల్చారు వినిపించలేదా !

భలే : నువ్వు పనిచేస్తున్న కంపెనీ ఎం.డి నీకు తెలుసా !

వెంక : తెలుసు కానీ చూడ్లేదు !!

భలే : తెల్సా ! చూడలేదా ? ! అడిగింది వెంకటేశ్వర్లుని !! అదే అసలు వెంకటేశ్వర్లుని

చిన్నా : అసలు వెంకటేశ్వర్లా అంటే !!

రామ : మా ఎం.డి మాకు తెలియకుండా వుంటాడా !! దేనికీ ?

శివ : వారు ఎంతటి వారో క్లుప్తంగా చెప్పు...

రామ : క్లుప్తంగా చెప్పటానికి సాధ్యపడని అసాధ్యుడు!!

వెంక : పదాలు కాస్త ఆలోచించి వాడండి !! వారు గొప్పవ్యక్తి !! ఆదర్శమూర్తి

రామ : గొప్ప వ్యక్తి ...ఆదర్శమూర్తి !

వెంక : నిగర్వి...

రామ : నిగర్వి – ఇంక చాల్లే !!

వెంక : నిరాడంబురులు !!

రామ : అవును దిగంబరులు

వెంక : దిగంబరులు కాదు !! నిరాడంబరులు!!

చిన్న : సార్ !! వన్‌మినిట్ నన్ను కొడితే కొట్టారు !! నేనేం ఫీలవను. ఇప్పుడు వెంకటేశ్వర్లు వారు కాదా ?

భలే : ఉదయం – ఏకవచనాలతో తీసిపారేసినట్టు వాగేవట నిజమేనా ?!

రామ : ఎవర్సార్ ! ఆ మాట చెప్పింది !! ఆయనంటే నాకెంతో గౌరవం !! కల్లో అయినా సరే పాదాభివందనం చేస్తా !!

శివ : ఇప్పుడు ఇలా మాట్లాడుతున్నాడు కానీ !! చాలా చీఫ్‌గా మాట్లాడేడు !! కావాలంటే అతన్ని అడగండి !!

చిన్న : సార్ మీరెవరోగానీ చిన్న సహాయం చేసి పెట్టండి. వీళ్ళిద్దర్లో అసలు వెంకటేశ్వర్లు ఎవరో చెప్పండి ?

భలే : వెంకటేశ్వర్లు అంటే మా కంపెనీ పి.ఆర్.ఓ అదుగో అతనే ( రామకృష్ణని చూపించాడు )

చిన్న : ఆయనా !! మరి గేరంటీ సంతకాలు ...అది కాద్సార్ !! అసలేం జరిగిందంటే ... (రామకృష్ణ అటూ ఇటూ చూసి ఫ్లవర్‌వాజు పెట్టి చిన్నారావ్ నెత్తిమీద కొట్టాడు . చిన్నారావ్ కుప్పకూలిపోయాడు )

భలే : దేనికతన్ని కొట్టావ్ ? అసలేమిటి ఇదంతా !! ( రామకృష్ణ , చిన్నారావ్‌ని ఈడ్చుకుంటూ తీసుకుపోతున్నాడు )

వెంక : సార్ జరిగింది మొత్తం దాచకుండా చెప్తా సార్ ! కానీ చెప్పేముందు మీరు మా ఎం.డి భలేరావ్ గారు అని రుజువు చేసుకోగలరా...

శివ : అంటే ఆయన, నేను అబద్ధం ఆడుతున్నానని అనుమానమా. మారువేషంలో వచ్చాం కాబట్టి ఇప్పటికిప్పుడు రుజువు చేసుకోవడం కాస్త కష్టమే కావచ్చు !

వెంక : ఓహో అదన్నమాట సంగతి ! అయితే నే వెంకటేశ్వర్లుని కాదు ! లోపల వున్నదే వెంకటేశ్వర్లు !!

భలే : ష్యూర్...

వెంక : పక్కా

శివ : కాన్ఫడెంట్...

వెంక : ఇదేవన్నా కె.బి.సి.ప్రోగ్రామా ? ష్యూర్ ! కాన్ఫిడెంట్ అంటున్నారు !! నేను వెంకటేశ్వర్లు కాను ఓ.కే ( రామకృష్ణ అక్కడికొచ్చాడు ) చిన్నారావ్ ప్యాంటు షర్టు అతని భుజాన కనిపిస్తున్నాయి )

రామ : గేరంటీగా ఇహ షూరిటీస్ గురించి వచ్చినవాడి గురించి చిక్కుండదు.

వెంక : మీరు లోపల వుండగా వీళ్ళచేత నిజం కక్కించా ! ఈయన మా ఎం.డి కాదు !!

రామ : అలా అని ఒప్పుకున్నారు !!

వెంక : అదే గదా చెప్తున్నది !! అంచేత మీరే వెంకటేశ్వర్లు , నేనెవరయితే బావుంటుంది?! ( ఆలోచిస్తున్నట్టుగా )

శవ : బాగా ముదురు కేసే ! పేరు కూడా ఆలోచించుకుంటున్నాడు !! ( అంతలో చిన్నారావ్ తల మాత్రం బయటపెట్టి )

చిన్న : అన్యాయం !! ధారుణం , కొట్టటమే కాక డ్రస్సు కూడా లాగేసుకుంటారా !! నే డ్యూటీకి వెళ్ళాలి !! ప్లీజ్ సార్ మీరయినా చెప్పండి సార్ ....

భలే : అంతా అయోమయంగా వుంది ! అసలేం జరుగుతోంది ! అసలేమిటి ఇదంతా ??

రామ : చెప్తాంగానీ అసలు మీరెవరూ !! ఈ వేషాల్లో ఎందుకొచ్చారు ! అయిదు నిమిషాల్లో గాని చెప్పకపోతే పోలీసుల్ని పిలుస్తాం !!

శివ : అలా అయితే ఏం చెప్పం !! పిలవండి పోలీసుల్ని వాళ్ళతో మాకు పనుంది ....

చిన్న : హల్లో మిమ్మల్నే !! నా బట్టలు నాకివ్వండి !! హ్యూమన్ రైట్స్ వాళ్ళకి కంప్లేంట్ చేస్తా !! నా సంగతి నీకు తెలీదు !! పెద్ద పెద్ద వాళ్ళతో పరిచయాలున్నాయి ! తెల్సా !!

భలే : నువ్వు పదినిమిషాలు సైలెంట్‌గా వుంటే నీ డ్రస్సు నీకిప్పిస్తా ఓకే....

చిన్న : థాంక్యూసార్ ...టైం చూసుకోండి...

శివ : ఓకే...యువర్ టైం స్టార్ట్స్ నౌ....

భలే : సరే !! ఇహ నేను లేచి నడుం కట్టేక దాన్ని నడపకపోతే డైలీ సీరియల్లాగా అనంతంగా సాగేట్టుంది. మీరిద్దరూ అలా నిల్చోండి !! ఇపుడు మనముందు ఇద్దరు వెంకటేశ్వర్లున్నారు !! కానీ వాళ్ళలో ...ఒక్కడే అసలు వెంకటేశ్వర్లు !! ఆ అసలు వాడెవడో మనం తెల్సుకోవాలి !! మీ ఇద్దరిలో వెంకటేశ్వర్లు ఎవరయినా గాని కంపెనీ ఎం.డి గురించి అగౌరవంగా మాట్లాడి, అవమానపరచి , హింసని, దౌర్జన్యాన్ని ప్రదర్శించి హోదాకి తగ్గ ప్రవర్తన లేని కారణంగా కంపెనీ చట్టంలోని మూడో అధ్యాయం ఆరో క్లాజు ప్రకారం వెంకటేశ్వర్లు అనే ఉద్యోగిని ఆరునెలలు సస్పెండ్ జరిగింది.

రామ : ( నిర్లక్ష్యంగా ) నేను వినటం జరగలేదు.

వెంక : సార్ సస్పెన్షన్ దాకా ఎందుకుసార్ ? మొత్తం నే చెప్తాసార్....

భలే : తనే వెంకటేశ్వర్లు అయినట్టు ఆ కంగారు చూడు.

శివ : మాటకి లెక్కలేకుండా పోయిందా !! రాసి చేతికిస్తే సరి.

భలే : అలాగే చేద్దాం !! వైట్ పేపర్ చూడు

శివ : ( రామకృష్ణ ) దమ్ముంటే ఒక్క తెల్ల కాగితం ఇచ్చి చూడు !!

రామ : ఇవ్వను – చూడను....

వెంక : నాకెందుకో భయంగా వుంది. నా మాటకి విలువపోయింది !! నన్ను పిచ్చివెధవని అనుకుంటున్నారు.

రామ : నువ్వు నిజంగా పిచ్చివాడివే !! కాకపోతే వీళ్ళ గురించి ఇంత భయమా ? ( అంతలో చిన్నారావ్ చింకి చాప చుట్టుకుని తెల్ల కాగితం పుచ్చుకుని ఎగురుకుంటూ అక్కడికొస్తున్నాడు ! అది చూసి వెంకటేశ్వర్లు కంగారుపడి )

వెంక : అమ్మో ! అదిగో వైట్ పేపర్ !!

రామ : వైట్ పేపరు ముఖ్యంకాదు ...ఎరువుల కంపెనీకి ఎం.డి కావడం ముఖ్యం.

వెంక : అయామ్ వెరీ సారీ !! నే రిస్క్ తీసుకోను సార్ !! మీరెవరో మా ఎం.డి.భలేరావ్ గారు అయినా కాకపోయినా నే మాత్రం కేషియర్ వెంకటేశ్వర్లునే సార్ !!

భలే : అలాగే – నువ్వు ఎలా అంటే  అలా సరేనా....

శివ : నువ్వు చత్రపతి శివాజీ అన్నా నాకేం  అభ్యంతరం వుండదు . ( చిన్నారావ్ టైం అయిపోవడంతో  చిత్రమైన  శబ్దాలు చేసి  వాచీ చూపిస్తున్నాడు )

వెంక : ఇదెక్కడి గోలండీ !! నేను పిచ్చివాడ్ని  కాన్సార్ !! కావాలంటే  ఈ చిన్నారావ్‌ని అడగండి !! చీటీ  పాడిన వెంకటేశ్వర్లు నేనే !! ( చిన్నారావ్  నాకేం తెలియదని చేతులు తల తిప్పుకున్నాడు )

శివ : నీ పిచ్చిగాని పిచ్చివాడ్ని  పిచ్చివాడిగా కాక పిచ్చిపిచ్చిగా మంచివాడిగా ఎవరు చెప్పుకుంటారు !! ( అంతలో  రామకృష్ణ అక్కడికి వచ్చేడు )

2 రామ : సార్ ఇక్కడ నా డైరీ మర్చిపోయానా ? సరోజినీ దాంట్లో వుండిపోయింది.

భలే : సరోజిని  డైరీలో  వుండిపోయిందా ?

శివ : ఇంకో వెంకటేశ్వర్లులా వుంది...

2రామ : సరోజినీ  నా కవిత పేరు  !! తీరా  అక్కడ లేడీస్  మొహమాటపెడితే  కాదన్లేక !

1రామ : కాదన్లేక  – ఏం చేశావో ...చెప్పు....

2రామ : అంతేసార్ !! అంతే అలా  నోరు విప్పాను !!  ఒకటే ధార  ప్రవాహం  !! ( భలే రావ్ అప్పటికి  తెల్లకాగితం పైన నాలుగు  ముక్కలు  రాసి  సంతకం పెట్టి )

భలే :  ఇదిగో  సస్పెండ్  ఆర్డరు  వెంకటేశ్వర్లూ  తీసుకో.

వెంక : సార్... సారీ సార్...ప్లీజ్ క్షమించండి సార్ .... నే తీసుకోలేన్సార్ ! వెంకటేశ్వర్లు నేనే  సార్ !! ( రామకృష్ణతో ) అలా ... నిల్చుంటారే ...కాస్త మాట  సాయం చెయ్యొచ్చుకదా !

1రామ : ఓ.కే.వెంకటేశ్వరు అతనే ...నే కాదు సరేనా

2 రామ : అవున్సార్  ! వెంకటేశ్వర్లు వీరే !

చిన్నా : హమ్మయ్య  టైం అయిపోయింది !! సార్ లక్ష రూపాయల  చీటీ  పాట పాడుకునే వెంకటేశ్వర్లు  ఎవరో చెప్పండి !!

భలే : సరే నువ్వే వెంకటేశ్వర్లువి అనుకుందాం !!  మరి అతనెవరు  ? ! పేరేమిటీ ?

శివ : ఇందాకా  వెంకటేశ్వర్లు  అని ఎందుకు  చెప్పుకున్నాడు.

చిన్నా : అలా అడగండి...

వెంక : సార్ !! నేను వెంకటేశ్వర్లుని. దాంట్లో  ఏమాత్రం  సందేహం  అక్కర్లేదు  కానీ !! ఆయనెవరో  చెప్పాలంటే  మీకు సరోజిని తెల్సా !

భలే : ( ఆ పేరు వినగానే భలే రావులో కాస్తంత కంగారు కనిపించింది ) ఇప్పుడా గొడవలన్నీ దేనికి. సరోజిని నాకు తెలీదు.

వెంక : అయితే వారిపేరు రామకృష్ణ సార్ !!

2రామ : అబద్ధం !! రామకృష్ణ వారు కాదు నేను !! తప్పు సార్ పెద్ద వాళ్ళతో అబద్దాలాడకూడదూ !!

1రామ : రామకృష్ణా బాగా చెప్పావ్ !! రామకృష్ణంటే నువ్వే !!

వెంక : సార్ నామాట నమ్మండి !! ఈయన పేరుగూడా రామకృష్ణే సార్ !! నా షడ్డకుడు !!

చిన్నా : సార్ !! ముందు వెంకటేశ్వర్లు ఎవరో తేల్చండి సార్ !!

భలే : ఆపండి !! ఇద్దరు వెంకటేశ్వర్లు !! ఇద్దరు రామకృష్ణులు !! ఏం తమాషాగా వుందా ? ఇంకో వైట్ పేపర్ ఇయ్యి !! ఉద్యోగం పీకి పారేస్తాను !!

చిన్నా : సార్ !! మీరు రామకృష్ణో, వెంకటేశ్వర్లో..... నా బట్టలు నాకివ్వండి సార్ !! నే డ్యూటీకెళ్ళాలి....ప్లీజ్ సార్ !!

భలే : బట్టలుకన్నా బాధ్యతలు ముఖ్యం !! నీ కష్టమరు వెంకటేశ్వర్లు ఎవరని అడిగేవామరి ?! ఆ సంగతి తెలీకుండానే వెళ్ళావంటే బాధ్యతారాహిత్యం అవుతుంది !! వెంకటేశ్వర్లు.

వెంక : సార్.... చెప్పండి సార్ !!

భలే : నీ భార్యని పిలు నేను మగాడ్ని నమ్మను !! ఆడదాన్ని నమ్ముతా !!

1రామ : యస్ !! నేనూ. అంతే లేడీస్‌ని నమ్ముకుని బతికేవాళ్ళం !!

2రామ : నాంచారమ్మగారు ఈపాటికే రావాలే !?

వెంక : వచ్చేస్తుంటుంది !!

శివ : నీ వైఫ్ వచ్చి నిన్ను వెంకటేశ్వర్లుగాను, తన భర్తగాను ఒప్పుకుంటే ఓకే. లేకపోతే ఫినిష్. ఉద్యోగంపోయి అడుక్కుతినాలి !!

( నాంచారమ్మ అక్కడికి స్టయిల్‌గా వచ్చింది )

నాంచా : హాయ్ వెంకట్ !! ఏం బావా కాఫీ తాగావా !? స్నానం అయ్యిందా ?!

వెంక : స్నానం అయింది గానీ ఇంకా అది అవలా ? నా వైఫ్ సార్ నాంచారమ్మ ! మా ఎం.డినే ....భలేరావుగారని....

నాంచా : పరాయి స్త్రీలని గౌరవించడం నేర్చుకో వెంకట్ !!

శివ : పరాయి స్త్రీలా అంటే మీరు....?!

భలే : ఇతను  నీ భర్తేనా .....భయంలేదు....వున్నది వున్నట్టు నిజం చెప్పు !!

నాంచా : కాదండి ! వీరు  నాకు మంచి మిత్రులు మాత్రమే !! భర్తకాదు.

1.రామ: వెంకటేశ్వర్లు అయిపోయావ్ !!

వెంక : సార్ !! ఇది నా వైఫే సార్ !! ఇవాళ  వైఫ్సడే అందుకని మొగుళ్ళు, స్నేహితులుగా చూస్తారట !!

2రామ:  అవున్సార్ !! మా సిస్టర్ గూడా మా బావని పొద్దున్నే  నిద్రలేపి ఏరా అంది !!

శివ : నేన్నమ్మను...అంతా మోసం !!

చిన్నా :నేనూ అస్సలు నమ్మను !! ఇతను వెంకటేశ్వర్లు కూడా కాదు !!

భలే : ఓకే.సరే !! అందరం నిజాయితీగా  మనసులు విప్పి వున్నది వున్నట్టుగా మాట్లాడుకుందాం !! భలేరావ్ అనే ఎం.డి గారికి ఒక అలవాటుంది తెల్సా !

వెంక : అంటే మీరు  ఎం.డి.భలే రావుగారు కాదా !

భలే : కాను....ఆయనకి మంచి ఫ్రెండ్‌ను !!

నాంచా : మీరూ ...నేనూలాగా

1రామ: చెప్పానా – ఆ సంగతి ముందే చెప్పా !

శివ : నేను  వీరి బావమరిదిని కాను !

చిన్న : ఇంతకీ పోనీ మీరు వెంకటేశ్వర్లు గారేనా ?

వెంక : ఎం.డి.నని చెప్పి భయపెట్టి  ఇంత నాటకం  ఆడతారా ? కడుపు  మండిపోతుంది !! నేను  వెంకటేశ్వర్లుని కాను పోండి !!

చిన్న : వెంకటేశ్వర్లు కారా ? నిజంగానా ?!

1రామ : నీవు వెంకటేశ్వర్లే !! కంగారుపడక...కాని వారిక్కాదు

2రామ : తెలివైన నాకే కన్ఫ్యూజన్‌గా వుంది !! అది కాదండి మీ వారి  పేరు వెంకటేశ్వర్లు గదా !! మరి ఆయన కాదంటారేమిటి ?

నాంచా : ఆయన వెంకటేశ్వర్లా !! శ్రీనివాసులా ఆయనిష్టం !! నాకు మాత్రం మొగుడు కాదు

చిన్నా : ఒంటిమీద బట్టల్లేక  వుండిపోయాగానీ లేకపోతే  ఈ పాటికి బంగ్లాదేశం పారిపోయే వాడిని !

1రామ :  సరేనండి !! ఇతను  వెంకటేశ్వర్లే !! ఈవిడ ఆయన భార్యే !! అయితే  ఏమిటి ?

నాంచా : సారీ బావా !  ఉద్యమాన్ని  నీరు కార్చలేను. స్త్రీజాతికి  అన్యాయం  చేయలేను.

వెంక : సారీ రేపు నా భార్య చేత దాని మొగుడ్ని అని చెప్పిస్తా...రేపు రండి !!

శివ : వుంటే అడుక్కుతినటానికి వచ్చా మా చెయ్యి ఖాళీలేదు రేపు రమ్మటానికి!!

1.రామ : ఒకసారి వేషాలు, అద్దంలో మొహాలు చూసుకోండి !! తెలుస్తుంది !! వెంకటేశ్వర్లూ చూస్తూ నిల్చుంటావేం ఇద్దర్నీ మెడపట్టి బయటికి గెంటెయ్!!

నాంచా : అవును వెంకట్ !! దేనికి వీళ్ళని చూసి అంత భయపడుతున్నావ్?

చిన్న : సరే !! ఇది తేలే వ్యవహారం కాదుగాని....నా బట్టలు నాకివ్వండి !! నేను డ్యూటీకి వెళ్ళాలి.

2రామ : భార్య మొగుడ్ని మొగుడు కాదంటుంది !! భర్తగారేమో ఆవిడే నా భార్య అంటున్నాడు !! అంతా కన్ఫ్యూజన్‌తో కొట్టుకు చస్తుంటే బట్టలూ బట్టలూ అంటూ నీగోలేమిటి !! వెధవ బట్టలు పోయేటప్పుడేం కట్టుకుపోతావా ?

చిన్నా : కట్టుకుపోవాలనే గదా సార్ నేనడిగేది ?

భలే : సరే మిస్టర్ !! అసలు వెంకటేశ్వర్లు !! అసలు సంగతి చెప్తున్నాం !! మేం ఎం.డి గారు పంపిన సీక్రెట్ ఏజెంట్ !!

శివ : అవును !! మీ ఎం.డి.గారికి ఓ నమ్మకం వుంది. ఇంట్లో పిల్లల్ని ప్రేమగా, చక్కగా చూసుకునే వాళ్ళు మంచి ఉద్యోగస్తులవుతారని...

భలే : పీఆర్వో అయిన నిన్ను కలవకపోవటానికి అదే కారణం. మమ్మల్ని ఇలా వెళ్ళి నువ్వు ఏ రకం మనిషివో చూసి రమ్మన్నారు !!

1.రామ : మళ్ళీ ఇదోకదా !!

చిన్నా : సార్ !! ఈ చాపల్లో చీమలున్నాయేంటి సార్ !! అమ్మో ( గెంతుతున్నాడు )

2.రామ : ఆహా !! నాకొచ్చేసింది ...మంచి థాట్. ప్రతి మొగుడికి ప్రశ్నాపత్రం లాంటి పొయిట్రీ... వుందా !! అసలు నీకు వుందా ? వుందా !! నీకుందా !!అసలుందా ! అసలు నీకుందా ?

వెంక : వుంది ఎంతో వుంది !! వుంది ఎంతో వుంది !! నాకెంతో వుంది !

చిన్నా : ఏవిటి వుందంటున్నారు ?

వెంక : అదే మీరడిగిందే !! చిన్నారావ్ ఇలారా ( చెవిలో ఏదో చెప్పగా )

చిన్నా : రండిసార్ అలా లోపలికి వెళ్ళి వుందో లేదో తేల్చుకుందాం !!

2 రామ: పదండి !! పదండి వుందా !! నీకుందా అసలుందా !! ( చిన్నారావు / రామకృష్ణ లోపలికెళ్ళారు )

భలే : సరే ఎక్కువసేపు వుండి మిమ్మల్ని ఇబ్బంది పెట్టడం మా కిష్టం లేదు !! మేం వెళుతున్నాం

శివ : మీ భార్య మిమ్మల్ని భర్తగా అంగీకరించటానికి ససేమిరా ఇష్టం లేదని అన్నట్టుగా చేస్తాం..

భలే : దాంతో మీ ఎం.డి గారికి నీ సంగతి అర్ధమౌతుంది. తర్వాత మీరూ మీరూ ఏం చేసుకుంటారో మీ ఇష్టం! ఏమ్మా వెళ్ళేముందు మరోసారి అడుగుతున్నా .... ఇతను వెంకటేశ్వర్లు పి.ఆర్.ఓ.నేగా

నాంచా : అవునండి !!

శివ : ఈ వెంకటేశ్వర్లు మీకేవుతారు ?

నాంచా : మంచి మిత్రులు ఫ్యామిలీ లైఫ్ ఫ్రెండ్ !!

భలే : మొగుడు మాత్రం కాదు.

నాంచా : అటు భర్త ! ఇటు ఉద్యమం !! హే భగవాన్ ఏమిటీ పరీక్ష..

వెంక : ( రామకృష్ణతో ) మీరు కాదని ఒక్కమాట చెప్పండి !! లేకపోతే ఉద్యోగం పోతుంది !! ( అంతలో చిన్నారావ్, 2 రామకృష్ణ బట్టలు వేసుకుని బయటికి వచ్చి )

చిన్న : ఘూరిటీ సంతకం గురించి వస్తే డ్రస్సు లాక్కుని డబాయిస్తాడా చూస్కో నా సంగతి మీకు తెలీదు పరువు నష్టం దావావేసి కోర్టు చుట్టూ తిప్పకపోతే నా పేరు చిన్నారావే కాదు !!

వెంక : ఆగవయ్యా బాబు ముందీ విషయం తేలనీ ....తర్వాత నీ సంగతి మాట్లాడతా ( 2 రామకృష్ణ ) చాప చుట్టుకుని ఎగురుతూ అక్కడికొస్తూ )

2.రామ : పొయిట్రీ వింటానని చెప్పి డ్రస్సులాగేసుకుంటారా. మనిషి మానప్రాణాలతోపాటు డ్రస్సు క్కూడా రక్షణ లేకుండా పోయింది. ఓ మై గాడ్ ఈ దేశం ఏమైపోతోంది.

1.రామ : ఎటు పోతుందో తర్వాత తెల్సుకుందాం. ముందా చాప గట్టిగా పుచ్చుకో...

వెంక : సరే... సార్...మీ పేర్లేవిటో గాని ఒక్కసారి లోపలికొస్తే అది నాభార్య అని, నే నిజం చెప్తున్నానని రుజువు చేస్తా !!

చిన్నా : సార్ వెళ్ళకండి బట్టలు లాగేసుకుంటాడు !!

2.రామ: చాపలు గూడా లేవు అయినా పదిమంది వొచ్చిపోయే ఇంట్లో నాలుగుచాపలు కొనొచ్చు కదా !!

భలే : ( శివప్రసాద్‌తో ) ఏం అంటావ్ ? వెళ్ళి ఏం చెప్తాడో విందామా ?

శివ : ఇద్దరూ వున్నాం !! మనకేమీ భయం. పదండి !! ( వెంకటేశ్వర్లుని / భలేరావుని / శివప్రసాద్‌లని తీసుకుని లోనికెళ్ళాడు )

నాంచా : బావా ! వొప్పేసుకోమంటారు !! పాపం కామాక్షమ్మగారు బాధ పడుతుందేమోనని చూస్తున్నా !! కట్టుకున్న మొగుడ్ని మొగుడు కాదు అని చెప్పాల్సి వచ్చినందుకు ఎంత కుళ్ళిపోతున్నాననో ఎవరికీ అర్ధం కాదు !!

2.రామ : కవిగా మీ కన్నీరు తుడవాలని తహతహగా వుంది !! కానీ ఈ చాప నా శీలానికి తెరచాపగా నిల్చి – ( లోపల ఏదో కుట్టింది ) అమ్మో !!

చిన్న : ఎర్రచీమలు

నాంచా : ఏంబావా !! అలా వున్నావ్ !! ఏదో ఆలోచిస్తున్నావ్ ?!

రామ : ఏం లేదమ్మా !! ఒక్క అబద్ధం ఎంత గందరగోళం సృష్టిస్తుందో తెలిసొచ్చింది !! ఈ గొడవంతా నా వల్లే జరిగింది!!నిజంగా నీ భర్త వెంకటేశ్వర్లు చాలా యోగ్యుడమ్మా !! అలాంటి వాడిని బాధ పెట్టడం మంచిది కాదు.!!

చిన్నా : అంటే అసలు వెంకటేశ్వర్లు వారేనా !! నిజం చెప్పిండి !

2.రామ : వారేనమ్మా వెంకటేశ్వర్లు – అంటే ఈవిడ ఆ వెంకటేశ్వర్లు గారి భార్య. పేరు నాంచారమ్మ !!

నాంచా : అవును బాబూ ! (లోపలి నుంచి ముగ్గురు అక్కడికొచ్చారు )...( భలే రావ్, శివప్రసాద్‌లు గుక్కపెట్టి వెక్కి వెక్కి ఏడుస్తున్నారు )

1.రామ : అదేవిటమ్మా ఏవైంది ? అలా ఏడుస్తున్నారు !! ఏవైంది !!

చిన్నా : కొట్టారా .....

2.రామ : పోనీ తిట్టారా....

నాంచా : ఫ్రిజ్జులో స్వీట్సు పెట్టారా ?!

వెంక : అవేంకావు. మా పెళ్ళిఫోటోలు చూపించి ఈ నాంచారమ్మ నా భార్య సార్ చూసుకోండి అన్నా !! అంతే ఇదీ వరస !!

శివ : మీ పెళ్ళి ఫోటో చూసి మేం ఎందుకేడుస్తాం !! మీరు నా పేరు వెంకటేశ్వర్లే సార్ !! ఆవిడ నా భార్య. కావాలంటే ఈ ఫోటో చూడండి అని చివర్లో ఏవన్నారు.....

వెంక : ఏవన్నానబ్బా !!

భలే : నా భార్య మీ భార్య లాంటిదేసార్ అన్నావా !! అంతే దు:ఖం ముంచుకొచ్చింది!!

1.రామ: మీరు భలేవారే !! దానికి ఇంత ఏడుపు ఏడవాలా ?! ( అంతలో ఫోన్ మ్రోగింది ! రామకృష్ణ వెళ్ళి ఫోన్ తీసుకుని ) హలో.... వెంకటేశ్వర్లు స్పీకింగ్ !!

చిన్నా : మళ్ళీ మొదలా ?! ఆయన వెంకటేశ్వర్లు ఏమిటి సార్ ?!

వెంక : పిచ్చివాడా ! సరోజినీల్లాంటి లేడీస్ వున్నంత కాలం రామకృష్ణలంతా వెంకటేశ్వర్లుగా మారిపోతారు !! జనన మరణాలు టైపులో ఈ కథ అనంతంగా సాగే అంతులేని కథ

2.రామ : అయితే చిన్న రిక్వెస్ట్ !!

భలే : ఏమిటో ?!

2.రామ: అంతులేని  కథ అంటున్నారు !! ఎందుకైనా మంచిది రెండు మూడు చాపలు కొనండి !! ( అందరూ నవ్వుతుండగా ...)

----- శుభం -----

**గమనిక :** ఈ నాటికపై సర్వహక్కులు రచయితవి. ప్రదర్శింపదల్చుకున్నవారు ముందుగా అనుమతి పొందటం ఎంతైనా అవసరం.